క్లుప్తంగా

నాణ్యతగా మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం నాణ్యతగా పెట్టాలని ఎంఈఓ కె.రవి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కాళమనాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తాజా కూరగాయలు ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. మరుగుదొడ్లు శుభ్రతగా ఉంచాలని ఆదేశించారు. ఎంఈఓ 2 ఉష, హెచ్ఎం కోటీశ్వరం పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు వసూలు చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ: వలంటీర్లు సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ సచివాలయంలో ఉప సర్పంచ్ మునిరాజా అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యదర్శి, ఉప సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగదు రహిత ఇంటి పన్ను వసూలుపై వలంటీర్లుకు అవగాహన కల్పించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కేవీబీపురం: కాంగ్రెస్ పార్టీ కేవీబీపురం మండల అధ్యక్షుడిగా కళత్తూరు గ్రామానికి చెందిన వేంబాకం రామచంద్రయ్య నియమితులయ్యారు. మంగళవారం ఈ మేరకు అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి. ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

సుమో ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన నరేంద్ర

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగ గ్రామానికి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు మేర్లపాక గ్రామానికి చెందిన కూనాటి నరేంద్ర(28) అలియాస్ నరేష్ మండలంలోని పుష్పిత్ కర్మాగారం వద్ద ఉన్న పెట్రోల్ బంకు వద్ద నుంచి కాలినడక రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న సుమో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన నరేంద్రను 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వాలి



సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దారు భార్గవి తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ, తానిగిల్లు గ్రామాల్లో ఎండీయూ వాహనాల సరుకుల పంపిణీని పరిశీలించి, డీలర్లతో మాట్లాడారు. సరుకుల పంపిణీపై గ్రామస్తులకు ముందుగా సమాచారం ఇవ్వాలని తెలిపారు. సకాలంలో డీడీలను కట్టాలన్నారు. వీఆర్ఓ మోహన్ పాల్గొన్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులో బొలెరో వాహనం బోల్తా

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు, చెన్నైకు చెందిన ఐదుగురు భక్తులు బొలెరో వాహనంలో తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని మొదటి ఘాట్‌రోడ్డు మీదుగా కిందకు దిగుతుండగా రెండో మలుపు వద్ద బొలెరో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జీపులోని భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వాహనం నుంచి వారిని బయటకు తీసుకువచ్చారు. ఇంతలో అక్కడకు చేరుకున్న ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది గాయపడిన వారిని తిరుమలలోని అశ్విని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(అలిపిరి): శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో టీటీడీ ఆలయాలు, వసతి సముదాయాలు, వివిధ కార్యాలయాలలో పనిచేయుటకు మహిళా ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీఈవో శేష శైలేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని.. ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ మైదానంలో ఈ నెల 10వ తేదీన ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 8వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు, చిరునామా, ఉద్యోగ, అర్హత, జీత భత్యాలు, ఇతర పూర్తి వివరాలకు కార్పొరేషన్ వెబ్‌సైట్ http://slsmpc.in/ ను సంప్రదించాలని కోరారు.

ప్రజలకు రక్ష.. ఆరోగ్య సురక్ష



నారాయణవనం : ఆరోగ్య సురక్ష కిట్లు అందజేత



నాగలాపురం: శిబిరంలో పాల్గొన్న వైద్య బృందం

కేవీబీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య అన్నారు. మండలంలోని అంజూరు సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం రోగులను వైద్య సిబ్బంది పరీక్షించి మందులు అందజేశారు. ఎంపీడీఓ రామచంద్ర, సచివాలయ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, మాధవీరెడ్డి, చెంగయ్య, సురేష్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటరత్నం, ఎంపీటీసీ విద్యుల్లత, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

నారాయణవనం మండలంలో..

నారాయణవనం: జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని సముదాయం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీడీవో కృష్ణమూర్తి ప్రారంభించారు. తిరుపతి అరవింద్ ఐ హాస్పటల్ వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు. కంటి, మహిళ సంబంధ రుగ్మతలు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. మెరుగైన చికిత్స అవసరమైన వారిని వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. గైనిక్, జనరల్ మెడిసన్ స్పెషలిస్టు వైద్యులు సలహాలు, సూచనలు ఇచ్చారు. శిబిరాన్ని మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్, రాగసుధ, సీహెచ్‌వో శ్రీనివాసులు పర్యవేక్షించారు.

నాగలాపురం మండలంలో..

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహించారు. 230 మందికి బీపీ, షుగర్, ఆస్తమ, కంటి సంబంధింత వైద్య చికిత్సలు అందించారు. నాగలాపురం వైద్యాధికారి అరుణ్ కిషోర్ మాట్లాడుతూ తిరుపతి రుయా ఆస్పత్రి గైనకాలజిస్ట్, కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి మందులు అందించారని తెలిపారు. పేద ప్రజలు అందరికి మెరుగైన చికిత్స అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అడిషినల్ డీఎంహెచ్ఓ మృధులవాణి, కార్యదర్శి శైలెంద్ర, సర్పంచ్ కాంతమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ





ఏర్పేడు: అక్షింతల పంపిణీ, రేణిగుంట : అక్షింతలను సిద్ధం చేస్తున్న ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రంలో అయోధ్య శ్రీరామమందిరం(తీర్థక్షేత్ర ట్రస్ట్) నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు మంగళవారం సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు తాళ్లపాక నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు తీర్థ క్షేత్ర కరపత్రం, రామమందిర చిత్ర పటాన్ని అందజేశారు. సురేష్, మురళి, చంద్రశేఖర్ రెడ్డి, జానకిరామ్,చంద్ర, తిరుమలయ్య పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంటలో మంగళవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చిన అయోధ్య రామమందిర అక్షింతలు, పత్రికలను ఇంటింటికీ చేర్చే కార్యక్రమాన్ని బీసీ సంఘర్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూల వెంకటాద్రి యాదవ్ ప్రారంభించారు. ఈనెల 22న అయోధ్య రామమందిరం ప్రారంభం కానుందని, దేశంలోని హిందూజాతి మొత్తం హైందవ సనాతన ధర్మ వ్యాప్తికి ఈ మహత్కార్యంలో భాగస్వాములు కావాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వీటిని పంచుతామని వివరించారు.

పనులను వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు



కౌలిఫ్ట్‌ను అందిస్తున్న దాతలు

రేణిగుంట (శ్రీకాళహస్తి): ఆలయం పనులు వేగవంతం చేయా లని శ్రీకాళహస్తీశ్వరస్వామి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆలయంలోని మృత్యుంజయస్వామి ఆలయం పక్కన ఖాళీ ప్రదేశంలో వేద ఆశీర్వచన మండపం నిర్మించనున్నారు. ఈపనులను మంగళవారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.

స్థానిక బృందాలకు అవకాశం కల్పించండి

మహాశివరాత్రి, ఇతర ఉత్సవాలకు స్థానిక కోలాట బృందాలకు అవకాశం కల్పించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున మంగళవారం శ్రీకాళహస్తీశ్వరస్వామి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన నృత్య ప్రదర్శన, శంకునాథ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమలకు విచ్చేసే కళాకారులకు ఉచిత రవాణా, వసతి గృహాల పారితోషికం పెంచాలన్నారు. తాలేటి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌ లిఫ్టు వితరణ

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం గోశాలకు గురువారం కౌలిఫ్ట్ వితరణగా అందింది. అనారోగ్యానికి గురైన ఆవులను తరలించేందుకు చీరాలకు చెందిన శ్రీభ్రమరాంబ సేవ సమితి వారు రూ.35వేలు విలువ చేసే కౌలిఫ్టును వితరణగా అందించారు. ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీస్వామి, అమ్మవార్ల ప్ర త్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

ముక్కంటి సేవలో నేదురుమల్లి



ఆలయంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రేణిగుంట (శ్రీకాళహస్తి): శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని మంగళవారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. నాయకులు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, చింతా మణి పాండు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

సత్యవేడు: ఎంఈఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం యూటీఎఫ్, ఏపీటీఎఫ్ డైరీ, క్యాలండర్లను ఎంఈఓ కె.రవి ఆవిష్కరించారు. సభ్యులు ఓ.త్యాగరాజులు, గురునాథం, ప్రభావతి, రాము, ప్రసాద్, రాజ్‌కుమార్, హెచ్ శ్రీనివాసులు, కె.మణి, రోహిణి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎస్టీయూ ఉపాధ్యాయ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను మంగళవారం ఎంఈఓ-2 గున్నయ్య ఆవిష్కరింపజేశారు. వరదయ్యపాళెం హైస్కూల్ హెచ్ఎం రమణయ్య, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళీ, జిల్లా కార్యదర్శి చిన్నయ్య, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి చెంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్, సభ్యులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

నారాయణవనం: మండలంలోని కసిమిట్ట సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన శకుంతల తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు..నారాయణవనం బీసీ కాలనీకి చెందిన శకుంతల సోమవారం సాయంత్రం మండలంలోని కసిమిట్ట సమీపంలోని ఆలయాన్ని దర్శించుకుని ఇంటికి వస్తోంది. కసిమిట్ట క్రాస్‌వద్ద మోటర్‌సైకిల్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 11 గంటలకు మృతి చెందింది.

క్యూఆర్ స్కాన్‌తోనే చెల్లింపులు

దొరవారిసత్రం: సచివాలయం పరిధిలో జరిగే ఇంటి పన్నులు తదితర అన్ని చెల్లింపులు ఇక నుంచి క్యూఆర్ స్కాన్ ద్వారా జరుగుతాయని డీఎల్‌పీఓ రవీంద్రబాబు అన్నారు. మంగళవా రం ఏకొల్లు, తల్లంపాడు సచివాలయాల పరిధి లోని పలు గ్రామాల్లో డీఎల్‌పీఓ, ట్రాన్స్‌కో సి బ్బంది కలిసి పర్యటించి, వీధి దీపాలకు చెందిన మీటర్లు, తాగునీటి పథకాలకు చెందిన విద్యుత్ మీటర్లను జియో ట్యాగింగ్ చేశారు. అనంతరంసచివాలయాలను సందర్శించి, రికార్డులు తని ఖీ చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శు లు మధు, రామయ్య, ఎల్ఎం బాలు ఉన్నారు.

కండలేరులో 13.008 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 13.008 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే ముంపు ముప్పు తప్పింది

- టీడీపీ అవాస్తవ ఆరోపణలు తగవు
- స్పష్టం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రేణిగుంట (శ్రీకాళహస్తి): ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముందుచూపుతోనే ఊరందూరకు ముంపు ముప్పు తొలగిందని వైఎస్సార్ సీపీ నేతలు స్పష్టం చేశారు. గత నెలలో కురిసిన వర్షాలతో ఊరందూరు చెరువు నిండుకుండలా మారింది. తూముల వద్ద ఏర్పాటు చేసిన తలుపులు తొలగించకుంటే ఊరందూరు గ్రామానికే పెనుప్రమాదంగా మారేది. ఎమ్మెల్యే బియ్యపు మధసూదన్‌రెడ్డి ఆ తూముల వద్ద ఏర్పాటు చేసిన తలుపుల ను హిటాచీతో తొలగించి గ్రామం ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకున్నారు. రక్షణ చర్యలు చేపట్టిన ఎమ్మెల్యేపై ఆరోపణలు చే యడం టీడీపీ నాయకులకు వైఎస్సార్ సీపీ నా యకులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఊరందూరు చెరువు ప్రమాదకర స్థాయికి చేరుకునపుడు తూములు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు తెలపడంతోనే ఎమ్మెల్యే వెంటనే స్పందించారని తెలిపారు. తూములు తొలగించి చెరువులోనీటిని బయటకు పంపడం వల్లనే ఊరందూరు ప్రమాదం నుంచి బయటపడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమారుడు ఆకర్ష్‌రెడ్డి అక్కడకి చేరుకుని పరిస్థితిని గమనించి అప్పటికప్పుడు హిటాచీతో తూముల వద్ద డోర్లను తొలగించడం వల్లనే మంచి జరిగిందన్నారు. అది మరచి బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఊరందూరుకు ఏమీ చేయలేదని, చెరువు వద్ద తామే జేసీబీ ఏర్పాటు చేశామని అసత్యాలు చెబుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించడంలా ఉందని పేర్కొన్నారు. ఆత్మసాక్షిగా గుండెపై చేయి వేసుకుని ఎమ్మెల్యే సాయంతో బయటపడ్డామని టీడీపీ నాయకులు చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ ఊరందూరు నాయకులు హరినాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, దిలీప్, రంగయ్య, సంజీవయ్య, సాయి, నవీన్, మురళి, నేతాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు అనూహ్య స్పందన



సత్యవేడు: క్రీడా పరికరాలను అందజేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అనూహ్య స్పందన లభిస్తోందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కాళమనాయుడుపేట సచివాలయ పరిధిలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ క్రీడా కారులు ప్రతిభను చాటుకునేందుకు ఇదిచక్కటి అవకాశమన్నారు. మండల పరిధిలోని ఆంబాకం, కాళమనాయుడుపే, శిరుణంబూదూరు పంచాయతీల్లో జరిగిన బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో 29 టీమ్‌లు పాల్గొన్నట్లు తెలిపారు. మొత్తం 168 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. ఎంఈఓలు కె. రవి, ఉషా పోటీలను పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో పీడీలు మురళి, మణి, సతీష్, అపర్ణ, ఢిల్లీరాణి, స్వర్ణ, ప్రతిమ, నాగరాజు, పయనిబాబు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల సత్తా

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామీణ క్రీడాకారులు సత్తాను చాటేందుకు ఆడుదాం..ఆంధ్ర గొప్ప అవకాశమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీలు కిషోర్‌కుమార్, మస్తాన్ తెలిపారు. మంగళవారం పాఠశాల క్రీడా మైదానంలో బాలికల క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. వారు మాట్లాడుతూ చదువుతోపాటు ప్రతి ఒక్కరు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు. గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పాల్గొన్నారు.





బీఎన్‌కండ్రిగ: క్రికెట్ పోటీల్లో పాల్గొన్న బాలికలు, సత్యవేడు.. కాళమనాయుడుపేటలో వాలీబాల్ పోటీలు

శ్రీసిటీ సందర్శనకు రండి

- ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానం
- పీఎస్ఎల్వీ సీ-58 విజయవంతంపై అభినందన



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు: పీఎస్ఎల్వీ సీ-58 రాకెట్ ప్రయోగం విజయవంతంపై ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్, షార్ డైరెక్టర్ ఏ. రాజరాజన్, షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ అద్భుత ఘట్టాన్ని షార్ విజన్ కంట్రోల్ సెంటర్‌లో కూర్చొని వీక్షించిన ఆయన, అంతరిక్ష సాంకేతికలో అగ్రగామిగా భారత దేశం స్థానాన్ని సుస్థిరం చేస్తూ, ఈవిజయాన్ని అందించిన ఇస్రో బృంధం కృషిని, అంకితభావాన్ని కొనియాడారు. శ్రీసిటీ వేగవంతమైన ప్రగతిని విస్తరిస్తూ, తాజా అభివృద్ధిని ప్రత్యక్షంగా చూసేందుకు ఇస్రోకు సహకరిస్తున్న పరిశ్రమల సీఈఓలతో కలసి సంభాషించేందుకు శ్రీసిటీని సందర్శించాలని సోమనాథ్‌ను రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానాన్ని అంగీకరించిన డాక్టర్ సోమనాథ్ 2019,మేలో వీఆర్‌వీ(చార్ట్‌గ్రూప్) పరిశ్రమకు చెందిన క్రయోజెనిక్ ట్యాంక్‌ను షార్‌కు అప్పగింత కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన తాను శ్రీసిటీ సందర్శనను గుర్తు చేసుకుంటూ, ఇస్రోకు శ్రీసిటీకి చెందిన కొన్ని కంపెనీల కీలకమైన సహకారానికి అభినందనలు తెలిపారు. కాగా శ్రీసిటీకి చెందిన వీఆర్‌వీ(చార్ట్‌గ్రూప్) రోటోలాక్, వాల్-మెట్ ఇంజినీరింగ్, నోవా ఎయిర్, సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమలు తమ ఉత్పత్తుల సరఫరా, సేవల ద్వారా చంద్రయాన్-3, ఆదిత్య ఎల్ -1 మిషన్‌లతో సహా వివిధ ఇస్రో ప్రాజెక్టులలో పాలు పంచుకున్నాయి.

వైఎస్సార్ ఆసరా జాబితా విడుదల



జాబితాను ప్రదర్శిస్తున్న నాయకులు,అధికారులు

నాగలాపురం: నాగలాపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో 1, 2, 3 సచివాలయాల పరిధిలోని వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల 4 విడత జాబితాను మంగళవారం నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్, వైస్ఎంపీపీ కుమారి ఉదయ్ కుమార్ రెడ్డి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతి వెకేషన్ క్రియేటివ్ ఎబిలిటీ కోర్స్

తిరుపతి(అలిపిరి): ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు సైన్సు సెంటర్‌లో సంక్రాంతి వెకేషన్ క్రియేటివ్ ఎబిలిటీ కోర్సు హించనున్నామని.. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సైన్స్, జీవ శాస్త్రాలపై ప్రత్యేక ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడానికి ఓ కార్యాచరణ ఆధారిత అభ్యాసమని.. కోర్సు సమయంలో విద్యార్థులు సెల్స్, సెల్ ఆర్గానెల్లెస్, సెల్ డివిజన్లు, మైటోకాండ్రియా, న్యూక్లియస్, క్లోరోప్లాస్ట్ తదితర సెల్యులార్ కాంపోనెంట్ల వంటి కణ అవయవాలను వేరు చేయడం గురించి సవివరంగా నేర్చుకుంటారని పేర్కొన్నారు. అన్ని కార్యకలాపాలు సెల్(కణాలు), సెల్ భాగాలపై ప్రాథమిక అవగాహనపై ఆధారపడి ఉంటాయని.. ప్రయోగాలతో విద్యార్థులకు ఉత్సుకతను పెంచుతాయని తెలిపారు. కోర్సు నిర్వహించడానికి అవసరమైన వస్తువులు, పరికరాలు ప్రోగ్రామ్‌లో భాగంగా అందించబడుతాయని తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటలకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 కోర్సు క్లాసులు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000 ఉంటుందని, పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నందున మొదటగా రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రాతిపదికన ఆధారపడి ఉంటుందన్నారు. వివరాలకు ఎడ్యుకేషన్ విభాగాన్ని వ్యక్తిగతంగా సంప్రదించాలని లేదా 0877-2286202/203, 91-7989694681 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న వ్యవసాయ ఏడీఏ అనిత

సూళ్లూరుపేట రూరల్: రైతులు తాము సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, దీనిపై వారికి అవగాహన కల్పించే బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందని ఏడీఏ అనిత తెలిపారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట వ్యవసాయ అధికారులు, వీఏఏలకు ఈ-క్రాప్ నమోదుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి , వేరుశనగ, మిరప, మినుములు , కూరగాయలు సాగు చేసిన రైతులు ఈ నెల చివరిలోపు ఈ-క్రాప్ నమోదు జాబితాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే ఉచిత పంటల బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో బహుళ ప్రయోజనం



కాలిబాటలు తీసిన వరి పొలం

ఓజిలి: వరి సాగు చేసే రైతులు పొలాల్లో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే అదనపు దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. పొలంలో కాలిబాటలు తీసేందుకు అదనపు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని చాలా మంది రైతులు వెనకాడడం సరికాదని వారు అన్నారు. నాట్లు వేసే కూలీలు కాలిబాటలు తీసేందుకు ఎకరానికి రూ.1200 నగదు తీసుకుంటున్నారన్నారు. కాలిబాటలు తీయడంతో నాలుగు నుంచి ఆరు బస్తాలు బస్తాల దిగుబడి అదనంగా పొందవచ్చని ఓజిలి ఏఓ రమేష్ తెలిపారు. ఈ సీజన్‌లో ఆలస్యంగా వరినాట్లు వేసే రైతులు తప్పనిసరిగా కాలిబాటలు వేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు తమ సిబ్బందితో కాలిబాట వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు ఆయా గ్రామాల్లో వివరిస్తున్నారని చెప్పారు. ప్రతి రెండుమీటర్లకు ఒక అడుగు వెడల్పున, గట్లపక్క నుంచి అడుగు ఖాళీ ఉండేలా బాటలు వేసుకోవాలన్నారు.